


# 14

## తల్లావజ్ఝల పతంజలిశాస్త్రి

ఉదయం ఎనిమిది దాటిపోయింది. శీతాకాలపు చలిలో రెండు కిలోమీటర్లవతల సముద్రం కలవరపడుతోంది. చల్లటి గాలి చూరుకింద నుంచి కెరటంలా కాసుల మీద పడుతోంది. అరుగు మీద ప్లాస్టిక్ కుర్చీలో కూచుని వేడి టీ చప్పరిస్తున్నాడు కాసులు. ఇస్త్రీ చేసిన తెల్లచొక్కా, తెల్లపేంటూ జాగ్రత్తగా నున్నగా చేసుకున్న గడ్డం, మూతి మీద నల్లటి మీసం, పైకి ఎగదువ్విన పెయ్యానాకుడు జుత్తుతో అతను నలభై అయిదున్నా పదేళ్లు తక్కువగా కనబడతాడు. టీ గ్లాసు పక్కనపెట్టి జేబులోంచి సిగరెట్టు తీశాడతను. ఒకసారి ఇష్టంగా వాసన చూసి వెలిగించాడు. ముద్దొచ్చే నీలం అక్షరాలతో చక్కటి తెల్లటి ఖాళీ సిగరెట్ పెట్టెని పారెయ్యాలనిపించలేదు. కిటీకిలో పెట్టేడతను. సగం పెట్టె ఉండగానే 'ఉంచుకో కాసులూ



# కాసులోడు

రాత్రికి పని కొస్తా'యని ఇచ్చేశారు రెడ్డిగారు.

''డ్రెసన్సా గట్టా ఏసి కూకున్నావు, కాకినాడగాని ప్రెయాణవా?" సైకిలు మీంచి ఓ కాలు నేలమీద ఆపి నోట్లో చుట్టపీకని ఎడం చేత్తో తీసుకుంటూ అడిగేడు సత్తినాయుడు. ఎదురుగుండా గుమ్మం ముందు సైకిలాపినా కాసులు గమనించలేదు. దరిదాపు ఉలిక్కిపడి 'మరే' అన్నాడు.

"ఎల్లుండి మీటింగంట. వైజాగు నుంచి వత్తన్నారంట గదా?"

''బొక్కలో మీటింగు. ఊరోళ్లని చెడదొబ్బుతున్నారు, కొడుకులు. ఎవడికి దూలగా ఉంటే ఆడు బూవమ్ముకుంటాడ్రా. ఈళ్లకేటీ తొక్కలాగ."

"పెద్ద ప్లీడరుగారంట. పేపర్లో యేశేరంట గదా?"

"అసలీ వైజాగు నా కొడుకులికి ఈ ఊళ్ల గొడవ లెందుకురా? అక్కడగాని ఎస్సీజెడ్‌లు లేవా? ఊళ్లో కుర్ర లంజొడుకుల్నాలి ఈయమ్మ." సైకిలు మీంచి కొంచెం ఒంగి రహస్యంగా పెద్దగా అడిగేడు నాయుడు.

"నీ పనెంత కాడికొచ్చింది?"

"మాటాడతన్నాను. ఆళ్లకి నా మీద గురి." కాసులు నిశ్శబ్దంగా నవ్వేడు.

"ఎస్సీజెడ్డంటే మాట్లెట్రా? ఒక్క లంజొడుక్కి తెలీడంలేదెహె. ఈ యెదవ ఎవడేనా రెడ్డిగారి ముందు నిలబట్టానికి దమ్ముందే? నా ముందు మినిస్టర్‌గారితోటి సెల్లో మాటాడేరంటే చూసుకో. నాకూ ఆరితోపాటే బోయినం గట్టా." కాసులు అప్రయత్నంగా కాలు మీద కాలు వేసుకున్నాడు. నాయుడికి రెడ్డిగార్ని కావలించుకున్నంత పనైంది.

"మన్ని మర్చిపోకొరే. నీకు తెల్దనిగాదనుకో."

కాసులు సమాధానంగా నవ్వేడు. దానికి సమాధానంగా నాయుడు కూడా నవ్వి సైకిలించాడు. బస్సుకి ఇంకా చాలా టైముంది. కిలోమీటరు పైగా నడిచినా పది నిముషాలు. ఆఖరి దమ్ములాగి సిగరెట్టు పారేశాడు కాసులు. ఎదురింట్లోంచి నూకరాజు చుట్ట నోట్లో పెట్టుకుంటూ మెట్లు దిగి రోడ్డు మీదికొచ్చేడు. తనవేపు చూడ్డంలేదతను. నూకరాజింటిముందు తాటాకు పందిరి వేశాడు. కొంచెం విశాలంగానే ఉన్న నల్లఅరుగుల మధ్య నుంచి మూడు నాలుగు మెట్లు లోపలి గడపవరకూ. నూకరాజు కాసులు కంటే పెద్దవాడు. రోడ్డుమీదికొచ్చి చుట్ట వెలిగించి యధాలాపంగా కాసులింటి వేపు చూసి చెయ్యి ఊపేడతను. కాసులుకూడా చెయ్యి ఊపేడు. నూకరాజు ఊళ్లోకి బయల్దేరేడు. కాసులు దృష్టి నూకరాజు మీద లేదు. ఉదయపు టెండలో నూకరాజు అరుగు ముందు త్రిశూలం మెరుస్తోంది. ఇంకా వాడిపోని పూలదండ, మధ్యకొమ్ము మీద నిమ్మకాయతో ఉన్న త్రిశూలం వేపు చూస్తూండిపోయాడు. మొన్నరాత్రి హడావుడి అంతా అతని కళ్లముందు కనిపిస్తోంది. రాత్రి ఏడు దాటింతరవాత పైడియ్య, భార్య ఒచ్చేరు. పైడియ్య భార్యకి భుజం మీంచి కొడుకుని దింపి అరుగు మీద పడుకోబెట్టగానే ఏడుపు ఆగలేదు. పైడియ్య నిస్సహాయంగా చూస్తూండిపోయాడు. అతని పెద్ద కూతురూ, రెండో కొడుకూ వచ్చి తల్లి చుట్టూ చేరేరు. తల్లి ఏడుపు చూసి వాళ్లూ ఏడవడం మొదలుపెట్టేరు. పది నిముషాల్లో పందిరినిండా జనం చేరేరు. పౌర్ణమిరాత్రి. ఆకాశం నుంచి వెన్నెలజల్లు ఇంకా వర్షంగా మారలేదు. లోపల్నించి నూకరాజు వచ్చేడు. ఎదురుగుండా పైడియ్య కనిపించాడు. అతన్ని చూడగానే పైడియ్య అన్నాడు.


''నాల్రోజుల్నించీ జెరం. నిన్నట్నించీ మూలుగండి. మతోతోందండి. ఇంకీయెయ్యాల అమ్మకాడికి తెచ్చేవండి. ఇంక అమ్మదయ."

"మన డాక్టరుగారు మజ్జేనం గోలీలిచ్చేరండి. అయ్యేసుకుంటే జరం దిగిపోద్దన్నా రండి. ఇయ్యాల పున్నమైంది గదాని అమ్మకాడి కొచ్చేవండి." నూకరాజు గంభీరంగా పైడియ్యవేపు చూశాడు. పైడియ్య భార్యవేపు చూశాడు. ఆమె కళ్లు తుడుచుకుంది. పైడియ్య కోసమో అక్కడ చేరిన జనం కోసవో "గోలీలు పన్జెయ్యలేదన్నమాట. మన చేతిలో ఉంటదేటి? చూద్దారి, ఈ యమ్మ తపసిలో కూసుంటదికదా. ఇహ అంతా పెద్దమ్మదయ, నీ అదృష్టం. సరే తెచ్చేరా అన్నీ?" అన్నాడు నూకరాజు. అగరొత్తుల కట్ట, అరడజను అరటిపళ్లు, రెండు నిమ్మకాయలు, వాటి మధ్య కానుక నోట్లూ తువాలు మూటలోంచి తీసి చూపించాడు పైడియ్య.

"దణ్ణవెట్టి నాగమ్మగారి కిద్దురుగాని. తెలుసుగందా?" అంటూ లోపలికి వెళ్లేడు నూకరాజు. పైడియ్య భార్యకి భక్తితో భయంతో ఒళ్లు బిగుసుకుపోయి ఏడుపు ఆగిపోయింది. పెద్దకూతురు తల్లికి అతుక్కుపోయి నుంచుంది. అనేకసార్లు చూస్తూనే ఉన్నా పందిరి కింద కొత్తపాకల గ్రామ కాపురస్తులు మాటలు మింగేసి, అందరూ కళ్లయిపోయి గుమ్మం వేపు చూస్తున్నారు. మరో అయిదునిముషాల తరువాత, ముందు నూకరాజు పళ్లెంతో వచ్చి గుమ్మం పక్కనే అరుగుమీద కూచున్నాడు. బీటలు తీస్తున్న నిశ్శబ్దంలోకి నాగమ్మగారొచ్చేరు. ఆమె నూకరాజు భార్య. ఎర్రటి ఉప్పాడ చీర, నుదుటి మీద పెద్ద కుంకుమ బొట్టు బిగించి చుట్టిన సిగ, మొత్తానికివన్నీ మోయలేనట్టున్న పల్చటి దేహంతో నాగమ్మ వచ్చి అందర్నీ చూసింది. కానీ ఆమె కళ్లు ఎవర్నీ గుర్తించినట్టు లేవు. అప్రయత్నంగా అందరూ దణ్ణం

పెట్టేరు. ఆమె స్వీకరించలేదు. అరుగుమీద పడుకోబెట్టిన అయిదేళ్ల వాణ్ని చూస్తూ ఆమె గడపవతల కూచుంది. నూకరాజు ముఖం గంభీరంగా బిగుసుకుపోయి నట్టయింది. ఒకసారి కళ్లు మూసుకున్నాడతను. దణ్ణం పెట్టుకుని కళ్లు తెరిచాడు. మళ్లీ అందర్నీ వేడి నిశ్శబ్దం అలముకుంది. సముద్రంలో స్నానం చేసి వచ్చేడేమో పైన చంద్రుడు శుభ్రంగా మెరుస్తున్నాడు. నాగమ్మగారి కళ్లు మెల్లిగా నిద్దరొస్తున్నట్లు తేలిపోతున్నాయి. రెండుచేతులూ చెరోవేపూ నేలమీద ఆనించి తలవాల్చేసింది. మరుక్షణంలో ఉన్నట్టుండి ఆమె పల్చటి శరీరం చిరిగిపోయేట్టు 'గంగమ్మతల్లో' అంటూ అరిచింది. మెరుపులాంటి జలదరింపు అందరి వీపుల్లోంచి పాకి కళ్లలోంచి వెళ్లిపోయింది. నాగమ్మ మరో రెండుసార్లు గంగమ్మతల్లిగార్ని కేకవేసింది. ఆమె కళ్లు మూతలు పడ్డాయి. అమ్మవారు ఒంటిమీదికి రావడంతో ముందుకీ వెనక్కీ తూలిపోతోందామె. పందిరికింద ఒక వేడి ఉత్కంఠ అలముకుంది. పైడియ్య భార్య జ్వరంగా ఉన్న బిడ్డని తీసుకొచ్చి నాగమ్మ ముందు పడుకోబెట్టింది. పైడియ్య దణ్ణం పెట్టి నుంచున్నాడు. అతని భార్య ఒంగి నాగమ్మకి రెండు చేతులూ జోడించి "బిడ్డపేనం కాపాడు తల్లో. జెరం దింపీ తల్లో" అని వేడుకుంది. నాగమ్మ శరీరంలోంచి, జ్వరం దిగిపోతుందనీ, భయం లేదనీ, ఊరంతనీ కాపాడుకుంటాననీ, తన మాట ఆలకించని వాడు దుమ్మయిపోతారనీ గంగమ్మ హామీ ఇచ్చింది. అందరూ అమ్మ మాట జవదాటం అని దణ్ణం పెట్టుకున్నారు. మరి కొన్ని నిముషాల తరువాత అమ్మవారు నాగమ్మని విడిచిపెట్టింది. నుదుటిమీద కారుతున్న చెమట నాగమ్మ బొట్టుని తడిపేసింది. అతికష్టం మీద కళ్లు తెరిచిందామె. వెంటనే నూకరాజు హారతి వెలిగించాడు. నిమ్మకాయల్ని కోసి అగరొత్తులు వెలిగించారు. హారతి వెలుగులో నాగమ్మ, ద్వారబంధం పటంగా దేవత బొమ్మలా ఉంది. మూడుసార్లు ఆమెకి చూపించి హారతి జనానికి చూపించాడు నూకరాజు. అందరూ కళ్లకద్దుకున్నారు.

మర్నాడు ఉదయానికి పైడియ్య బిడ్డకి జ్వరం తగ్గిపోయింది. పైడియ్య చెప్పి వెళ్లేడు. కానీ మధ్యాహ్నానికల్లా అందరికీ తెలిసిన వార్త ఎవర్నీ ఆశ్చర్యపరచలేదు. అనేకసందర్భాలలో అమ్మవారు నాగమ్మ మీదికి రావడం, ఆమె చెప్పింది అక్షరాలా రుజువైందనుకోడం తెలుసందరికీ. గంగమ్మకి ఊరంతా భక్తులైనా ఇటీవలికాలంలో స్కూలి కవతల చర్చి వెలిసింది. ముందు తాటాకుల పాకతో మొదలై క్రీస్తుకి ఒంటిగది సిమెంటు ఇల్లు అమరింది. ఆదివారాలు కొత్తపాకల కంటే పొరుగూర్నించి కొంతమంది రావడం మొదలై క్రమంగా మైకు సౌకర్యం కుదిరి సముద్రపుగాలి భక్తిపాటల్ని ముక్కలుగా ఊరికీ ఊరవతలకి కూడా పంచుతూంటుంది. కొద్దిమంది ఆడవాళ్లు తలమీద కొంగులు కప్పుకుని చర్చికి వెళ్లడం అయగారు చెప్పేది ఆలకించడం, మరికొద్ది మంది యువకులు టీషర్టుల్లోకి మారి మెళ్లో సత్తుశిలువలు వేసుకోవడం మినహా చర్చివల్ల కొత్తపాకల్లో పెద్దమార్పు రాలేదు. పౌర్ణమి రోజు మాత్రం వాళ్లు మునుపటిలా నాగమ్మగారింటికి రావడం మానలేదు.



కార్టూన్ల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కార్టూన్

- వినోద్.

కాసులు వాచీ చూసుకున్నాడు. ఆదివారం మానవహక్కులవాళ్లూ ప్లీడరూ వస్తారు. వాళ్లు రాకముందే ఊళ్లో కొంతమంది పంటభూములు అమ్ముకున్నారు. ప్రత్యేక ఆర్థికమండలి కొండచిలువలా భూములు మింగి లుంగచుట్టుకునిపడుంది. కాసులు బేరాలు కుదర్చడం, కాసులుగారవ్వడం మనిషి మునుపటికంటే నిటారుగా నడవడం జరిగేయి. రెడ్డిగారెప్పుడూ 'మన కాసులుగా'రనే అంటారు. ఎప్పుడూ కాకపోయినా తరచుగా వాళ్ల జీపులో ఇంటిముందు దిగినప్పుడు కాసులు కూడా కొంచెం రెడ్డిగారు జీపు దిగినట్టే కాళ్లకి అలవాటు చేశాడు. ఆ మానవహక్కుల "యెదవలు" ఊళ్లోకిరాకముందు తన ఇంటిదగ్గర సాయంకాలాలు గుంపుగా ఎస్సీజడ్ మలేరియాతో పోగయ్యే వారు. ("అంటున్నాననిగాదనుకో. నీ జన్మలో మూడులక్షల రూపాయలు గాని జూసేవా? గంగమ్మగారి మీద ఒట్టేసి చెప్పు") పేపర్లలో రాతలు, కుర్చీలుపోయిన నాయకుల మాటలు, వాళ్ల ఊళ్లలోకి దిగబడి ఓదార్పులూ అన్నీ కలగలపి రెండు మూడు చినుకులు పడి వాన ఆగిపోయినట్లయింది.

కాసులు "యెల్లన్నా తలుపేసుకో"మని శూన్యంలో చెప్పి రోడ్డుమీది కొచ్చేడు. లూనా మీద ఒస్తూ దేవుళ్లా కనిపించేడు కోమటి లక్ష్మయ్య. కాసులు చెయ్యి ఊపి ఆపించాడు.

"రోడ్డుమీదికేనా?"

"ఆ".

"పద. నేనూ అటే" అంటూ వెనకసీటుకి అటో తెల్లకాలూ ఇటో తెల్లకాలూ పడేసి ఇబ్బందిగా కూచున్నాడు కాసులు. లక్ష్మయ్య మురికి న్యూటరు కంటిందో, న్యూటరు మురికి లక్ష్మయ్యకంటిందో తెలీలేదతనికి.

"కాకినాడ ప్రెయాణవా?"

"ఆ. నువ్వో?"

"పేట. అవునూళ్లో మీటింగంట గదా. నీ ఎగస్పార్టీ వోళ్లా?"

ఒక శక్తివంతమైన బూతుమాటతో సమాధానం వెలిబుచ్చేడు కాసులు. "అంతేలే" అన్నాడు షావుకారు. సముద్రంలో తడిసి గాలి ఉదయపుటెండలోంచి బయటపడుతూ లక్ష్మయ్య మాటల్ని ఎత్తుకుపోతోంది. సముద్రానికీ తీరగ్రామాలకీ మధ్య గీసిన నల్లటి లక్ష్మణరేఖలాంటి తార్రోడ్డు ఒంపులో ఆపేడు లక్ష్మయ్య. కాసులు దిగ్గానే తలూపి వెళ్లిపోయాడతను. రోడ్డు వంపు తిరిగింది. ఒంపు తిరుగుతూ రోజుకి నాలుగుసార్లు బస్సు ఆగుతుంది. జనాన్ని బొక్కుతూ ఆటోలు మాత్రం ఎక్కువ తిరుగుతూంటాయి. ఇటీవలికాలం నుంచీ కాసులు ఆటోలు ఎక్కడం మానేశాడు. బస్సు టైము చూసుకుని బస్సులోనే వెళ్లి వస్తున్నాడు. మరోగంటకి గానీ కాకినాడ చేరలేదతను. రిక్షా ఎక్కి గెస్టుహౌసు దగ్గర దిగేడు కాసులు. కొత్తగా కట్టిన పెద్ద ఇల్లు తీసుకుని రెడ్డిగారు అతిథి గృహంగా మార్చుకున్నారు. గేటు దగ్గర యూనిఫాంలో ఉన్న వాచ్‌మెన్ కాసుల్ని చూసి నవ్వేడు. కాసులూ నవ్వి తలూపేడు గానీ వాడి పద్ధతి అతనికి నచ్చడం లేదు. సామాన్యంగా లోపలికి వచ్చినవాళ్లకి సెల్యూట్ కొట్టి నుంచుంటాడు. కాసులికి

మాత్రం పలకరింపు నవ్వుతో సరిపెడుతున్నాడు. ఎమ్మార్వోగారూ ఇతరులతో కలిసి తను వెళ్లేటప్పుడు మాత్రం అందరికీ సెల్యూట్లు సమర్పించుకుంటాడు. మెట్లెక్కి పైకి వెళ్లేసరికి రెడ్డిగారి మేనేజరు గుమ్మం ముందు సిగరెట్టు కాల్చుకుంటున్నాడు. కాసుల్ని చూడగానే "కాసులుగారూ గుడ్‌మార్నింగ్" అంటూ చెయ్యి అందించాడు. "అయ గుడ్‌మాణింగండి."

"దమ్ముకొడతారా, కాఫీ తాగుతారా?"

"మీరు తాగరేటీ?"

"మీకోసం తాగుతాలెండి" అని శబ్దం లేకుండా విశాలంగా నవ్వుతూ సిగరెట్టు మెట్లపక్క ఇసకకుండీలో పడేసి లోపలికి దారి తీశాడు మేనేజరు. మెత్తగా తలుపు మూసుకుంది. లోపల చల్లటి పరిమళం కాసుల్ని చుట్టబెట్టింది.

"సారులేరేటండి?"

"కలెక్టరుగారితో మాట్లాడ్డానికి వెళ్లేరు."

"ఒచ్చేత్తారా?"

"లేదు. ఎమ్మెల్యేగారు కూడా అక్కడికే వెళతారు. ఇద్దరూ కలిసి తీరిగ్గా భోజనం చేసి......"

"అయ. అవున్లెండి. మన ఎమ్మెల్యేగారికి సారంటే ప్రేనం లెండి."

మేనేజరు ఫోను చేసి రెండు కాఫీ తెమ్మన్నాడు.

"మీ టిఫినూగట్టా అయిపోయిందేటండి?"

"ఎప్పుడో మీరు?"

"ఇప్పుడొద్దు లెండి సారూ."

"సారీ కాసులుగారూ. రాగానే అడగవలసింది."

"ఐలేటోరండీ. మన మధ్య మోమాటాలేటండి."

మేనేజరు తీవ్రంగా నొచ్చుకుని మళ్లీ ఫోను చేసి కాసులు గారికి వెంటనే పూరీ ఇడ్లీ పంపించమని చెప్పేరు. టిఫిను ముగించి తృప్తిగా సోఫాలో వెనక్కివాలేడు కాసులు. ఫోనులో ఎవరితోనో మాట్లాడి కాసులువేపు చూసి అన్నాడు మేనేజరు.

"ఊ. ఏవంటున్నారు మీవాళ్లు?" అంటూ లేచి టేబుల్‌మీద ఉన్న మండలం మేపూ దానికి జతచేసి ఉన్న మూడు పుటల పొలాల సర్వేమేపూ తీసుకొచ్చి టీపాయి మీద పరిచాడు మేనేజరు. కొత్తపాకల గ్రామంచుట్టూ ఎర్రసున్నాలు. మళ్లీ అవతల ఎర్రసున్నాలతో ప్రత్యేక ఆర్థికమండలి ముక్కలుగా కనిపిస్తోంది. ఆ ఎర్రసున్నాలు చూడగానే వీపుమీద వాతలు పడ్డట్టయింది కాసులికి. కొత్తపాకల దాటగానే

# ఏకాకి

## కొత్తపల్లి రవిబాబు

ఆమె ఏకాకి!
తన భృతి తను సంపాదించుకొంటోంది.
ఆమె రూపురేఖలనవసరం
పెద్దదా! చిన్నదా!
వివాహితా! అవివాహితా!
పేదరాలా! ధనికురాలా!
ఇవన్నీ అనవసరం మీకు
మరల చెప్తున్నా ఆమె ఏకాకి!

ఆమె ఇంటి తలుపు తెరచి ఉంది
లోపలేదో సంభాషణ
ఆమెచుట్టూ తిరుగుతున్నాయి
ప్రశ్నల జోరీగలు -ఇంటా, బయటా
లోపలెవరున్నారు?
ఏం జరుగుతోంది లోపల!
దేని గురించి అదంతా. పనికిరాని ఆసక్తి
ఆమె ఇంటి తలుపు మూసినా
ప్రశ్నల బాణాలు తలుపుకు తగుల్తున్నాయి
అవిరామంగా!
మెదడు సుడులు తిరుగుతూ - గాసిప్‌లో మునిగి
ఆమె ఒక్కతే బయటకు వెళ్తుంది
చక్కగా అలంకరించుకుని
తేలికపడిన మనసుతో-
కానీ ఆమె వెనుక ప్రశ్నల పరంపర
ఎక్కడకు వెళ్తోంది! ఎవర్ని కలవడానికి!
అక్కడికెందుకు వెళ్తోంది.
ఆసక్తి ఆసక్తి ఆసక్తి
ఆవిడ స్వయం కృషితో సాధించుకుంది
ప్రమోషన్, జీతంలో పెరుగుదల
వృత్తిపరమైన పరీక్షల్లో విజయం
ప్రశ్నలడిగిన తలలు సిగ్గుతో నేలచూపులు-
నిరాశతో - బిడ్డ తలపుతో
ఇవన్నీ ఆమె ఎలా సాధించింది
ఆవిడకు సహకరించిన వారెవరు?
ఎందుకు సహకరించారు?
ఆవిడ తలుపుకు తాళం
ప్రశ్నలన్నీ దుష్టబుద్ధితో అడిగేవే!
సంతాప సభ పెట్టాలనే ఆసక్తి
ప్రశ్నలు, ప్రశ్నలు, ప్రశ్నలు - ఆమె గురించే
ఆమె తల్లులాంటివారు, అక్క చెల్లెళ్ల లాంటివారు
గతంలో అడిగినవే-
నేటి ఆమె సహచరులు
రేపు అక్కడివారు
నిజంగా ఆమె ఏ కాకేనా? ఎలా వచ్చింది?
ఆమె ఎవరు?
ఎక్కడి నుంచి వచ్చింది?
ఏకాకిగా ఎందుకుంది?
ఇంకా ఇంకా....

మరాఠీ మూలం : ఇందిరా సంత్ (1914-2000)
మరాఠీ నుండి ఆంగ్లం : వినయ్ ధర్వాడ్కర్ (అమెరికా)
ఆంగ్లం నుండి తెలుగు : కొత్తపల్లి రవిబాబు.

చాలా పొలాలు అమ్ముడైపోయాయి. రైతులందరూ మీటింగులకి కూచోవడం, మాట వినకపోవడం కలెక్టరుగారు బుజ్జగించినా పట్టించుకోకపోవడం జిల్లాయంత్రాంగానికి మింగుడుపడ్డం లేదు. ఎమ్మెల్యేగారు స్వయంగా వచ్చి అందరితో మాట్లాడి స్నేహపూర్వకంగా చేపలకూర మారు అడిగితిన్నా ప్రయోజనం లేకపోయింది. రెడ్డిగారు, ఎమ్మార్వోగారూ వచ్చి అందరితో ఇష్టంగా మాట్లాడి వెళ్లేరు. ఎమ్మార్వోగారు అప్పుడే కాసుల్ని ఎంచుకున్నారు. తుపాను బాధితుల సహాయ కార్యక్రమాలలో కాసులూ, ఎమ్మార్వోగారూ దగ్గిరయ్యేరు. రైతుల భూమి పోగొట్టుకోవడం, నష్టపరిహారం సమస్యగా మారింది. ఉన్న రెండు మూడెకరాలూ పోగొట్టుకుని నష్టపరిహారం జేబులో పడ్డ తరువాత ఇంక ఊరికీ, రైతుకీ సంబంధం ఏవుంటుంది? "మీకు న్యాయం జరుగుతుంది" అన్నారు ఎమ్మెల్యేగారు. కలెక్టరుగారు కూడా "మీ మీద బలప్రయోగం చెయ్యడం ఇష్టంలే"దన్నారు. ఇప్పుడున్న మార్కెట్‌ధర ప్రకారం రైతులెవరూ నష్టపోకుండా కంపెనీ చూసుకుంటుంది. కలెక్టరుగారు ఆ రోజు కారెక్కగానే కోమటి లక్ష్మయ్య అన్నాడు.

"కానేటోడు గవర్నమెంటాడు కాదు. ఆడెవడికో బూవమ్మని చెపతానికి గవమెంటా డెవడ్రా సత్యం?"

"ఈ రెడ్డిగారే గవమెంటెహె." చాలామందికి లక్ష్మయ్య మాటలు సబబుగా తోచేయి. తరవాత సత్తినాయుడికీ, కాసులికీ, లక్ష్మయ్యకీ జతకుదిరింది. లక్ష్మయ్య నోరుగలవాడు. అతనికొట్టు ప్రసారకేంద్రంగా కాసులు పని ప్రారంభించేడు. తుపాన్లు, అకాలవర్షాలు, పంటనష్టాలు, అప్పులు, రైతుల ఆత్మహత్యల నేపథ్యంలో డబ్బునే నమ్ముకోవడం ఎందుకు సబబో లక్ష్మయ్య ఒడ్డున కూచుని వలవిసిరినట్లు ప్రసారాలు చేస్తున్నాడు. విశాఖపట్నం నుంచీ "సంగంవోళ్లు" రాకపోతే కాసులికీ, లక్ష్మయ్యకీ ఇంత బాధ ఉండేది గాదు. కొత్తపాకల నుంచి తొండంగి వరకూ చాలాచోట్ల అమ్మకాలు ఆగిపోయాయి. కొత్తపాకల సంగతి తేలందే వందలాది ఎకరాలలో రావలసిన రోడ్లు, పార్కులు, కంపెనీవారి కోసం స్కూళ్లూ, పచ్చదనం కాయితాల మీదే ఉండిపోయాయి. కలెక్టరుగారికి ఎస్సీజడ్ వీపుమీద దురదమచ్చలా పెరుగుతోంది. రెండు నెలల క్రితం విశాఖ మానవహక్కుల నాయకుల ఆధ్వర్యంలో కలెక్టరుగారి బంగళాముందు ప్రదర్శన బైఠాయింపూ జరిగేయి. ఇంకాసేపటికి ముగుస్తుందనగా ఒక మహిళా కానిస్టేబులు తొందరపాటు వల్ల పోలీసులు కొద్దిపాటి ఎడంచేతి లాఠీఛార్జీ చెయ్యవలసి వచ్చింది. రెడ్డిగారు చొరవ తీసుకుని వెళ్లి ఊళ్లో క్షమాపణలు చెప్పి వచ్చేరు. అయినా ఎస్సీజడ్ నిద్రలో ఉన్న అనకొండలా చలనం లేకుండా పోయింది. దగ్గిర్లో ఎన్నికలు పెట్టుకుని బలప్రయోగం మంచిదికాదన్నారు ఎమ్మెల్యేగారు. ఎస్సీజడ్ రైలు పట్టాలు తప్పింది.

కాసులు నిస్పృహగా మేనేజరు వేపు చూశాడు. మేనేజరు అతనివేపు చూశాడు. కొన్ని క్షణాల తరవాత సోఫాలో కూచోడం కష్టమైంది కాసులికి. కిటికీలోంచి చూస్తూ అప్పుడు మేనేజరు



అన్నాడు.

"ఎలక్షన్లు నెత్తిమీదికొస్తున్నాయి. ఎమ్మెల్యేగారి నియోజకవర్గం మారిపోయింది. పని అవకపోతే రెడ్డిగారికి సమాధానం చెప్పుకోవాలి. జిల్లా బీసీ సంగం చైర్మన్‌తో మాటాడాలి చూడండంటున్నారు రెడ్డిగారు. ఆయన కేటండి? ఒకళ్లు కాపోతే ఇంకోళ్లు. పనిగావాలి గదా. రెడ్డిగారి కెపాసిటీ మీకు తెలీదు. సగం రాష్ట్రం ఎస్సీజడ్ కింద కొనీగల్రు. చాతకాక ఊరు కున్నారనుకున్నారా కాసులుగారూ".

కాసులికి గొంతులో చేపముల్లు దిగబడ్డట్టయింది. చేతిలో చెక్కు గాలి కెగిరిపోయి నట్లయింది. భుజం మీద చెయ్యేసి నవ్వుతూ అన్నాడు మేనేజరు.

"రండి. ఓ సిగరెట్టు కాల్చుకుందాం." ఇద్దరూ బయట నుంచుని సిగరెట్లు వెలిగించారు.

"ఊ. చెప్పండి. ఏవిటి విశేషాలు?" కాసులు ఆయనవేపు చూడ్డం లేదు. తురాయిచెట్టు వేపు చూస్తూ అన్నాడు.

"పనయిపోద్దండి. అప్పటికీ ఇప్పుడికీ పరిస్థితి మారిందిలెండి. ఆళ్లిచ్చినంత తీసుకుని మూసుకుని కూసునే పరిస్థితి తెచ్చుకోకండని చెప్తన్నావండి. రెడ్డిగారు చేతులెత్తేసేరంటే కలట్రుగారు రంగంలోకి దిగి ఇచ్చిన కాడికిచ్చి దొబ్బెయ్యమంటారని కూడా జార్తగా చెప్పేవండి. ఆ బయ్యం పట్టుకుందండి. ఆ మీటింగులూ గట్టా లేకపోతే మన పని అయ్యేపోనండి. మనోళ్లందరూ కాపడకుండా చేత్తానే ఉన్నారండి. మనం గూడా తొందరబడి..."

"కాసులుగారూ తొందరంటే తొందరేనండి. ఇది వేలకోట్ల రూపాయల వ్యవహారం. పెద్ద వ్యాపారం. ఈ వ్యాపారం మరోపేరుతో బాగానే సాగుతోంది. మీరు వయసులో నాకంటే చిన్నవారు. ఇది వరకు వ్యాపారవేత్త లందరూ నాయకుల కనుసన్నల్లో ఉండేవారు. ఇప్పుడట్టాగాదు. ఈళ్లకీ వాళ్లకీ తేడా లేకుండాపోయింది. వ్యాపారవేత్తల కనుసన్నల్లో నాయకులుంటున్నారు. అంచేత ఒకడనే ఉండదండి. వాడు కాకపోతే వీడు. మీరు తొందరపడక తప్పదు. ఒప్పుకుంటారా?"

"ఆయ. మీరన్నా ముక్కా బానే ఉందండి మరి. ఆయ. మరి మెడికలు కేంపన్నారు గదండి."

"అవును. నేనే మర్చిపోయాను. రేపాదివారం షామియానా వేయించి సిద్ధంగా ఉండండి. ఓ లేడీ డాక్టరూ, మగాయనా, కాంపౌండర్లూ వస్తారు. ఫ్రీగా మందులిస్తారు."

హాయిగా సముద్రపుగాలి సోకినట్టయింది కాసులికి. నాలుగైదు మెడికలు కేంపులు పెడితే వాటిపని అవి చేస్తాయని అతని నమ్మకం. అందుకే వరసగా నాలుగు గ్రామాల్లోనూ కేంపులు పెట్టమని సలహా ఇచ్చేడు.

"ఆయ. మీరీసారి జరిగేట్టు చూడండి."

"గేరంటీ. మీకు ఫోను చేస్తాను."

"మనకాడ ఫోన్లేదు గదండి."

చాలా నొచ్చుకుని మేనేజరుగారన్నారు. "కాసులుగారూ, మార్చేపోయాను. నాదగ్గిర రెండు సెల్లున్నాయి. చూస్తానుండండి. ఒకటి మీరు వాడుదురుగాని." కాసులికి ఆనందంతో నోటినిండా నవ్వూ కళ్లనిండా నీళ్లూ నిండేయి. మధ్యాన్నం దాటినా

రెడ్డిగారు రాలేదు. అప్పుడింక మేనేజరుగారు తన గదిలోంచి వచ్చి అన్నాడు.

"కాసులుగారూ, నాకు పనుంది. బయటికి వెళ్తున్నాను. మీరు మాత్రం బువ్వతిని వెళ్లండి." ఆయన వెళ్ళిన కాసేపటికి వంటగదిలో చిన్న చెక్కటేబులు మీద అన్నం వడ్డించాడు వంటవాడు. అంతకుముందే ఫ్రిజ్‌లోంచి చల్లటి బీరు తీసి ఇచ్చేడు వంటాయన. కాసులు కడుపూ మనసూ నిండుగా ఉన్నాయి. తీరిగ్గా భోజనం కానిచ్చి బయట వరండాలో సిగరెట్టు కాల్చుకుని ఊళ్లోకి బయల్దేరేడు కాసులు. పార్టీ ఆఫీసుకెళ్లి మెడికల్ కేంపు గురించి మాట్లాడి కార్యకర్తల్ని హెచ్చరించి బయటపడ్డాడు. చీకటి పడుతూండగా పాత హార్బరు రోడ్డు దగ్గిర ఆటోకోసం నుంచున్నాడు కాసులు. రెండుమూడు ఆటోలు జనంతో వెళ్లుకొస్తుంటే చూసి ఒదిలేశాడు.

"ఏటీ, కాసులే?" చటుక్కున వెనక్కి తిరిగేడతను. దగ్గిరికొచ్చి నిలబడ్డాడు నూకరాజు.

"ఎప్పుడొచ్చేవేటీ?" అన్నాడు కాసులు.

"నాలుగ్గైందనుకో" ఇద్దరూ మాట్లాడుకుంటూండగా ఆటో వచ్చింది. కొత్తపాకలవాళ్లు ముగ్గురున్నారు. కాసులు వివరంగా మెడికల్ కేంపు గురించి చెప్పేడు. నూకరాజుకి కచ్చిక నములుతున్నట్లుంది. చెవులకీ, నోటికీ హితవుగా లేదు. రోడ్డుపక్కన ఆటో ఆగేవరకూ కాసులు దాని గురించే మాట్లాడేడు.

"మీరెళ్లండి. ఎనకాల ఒస్తాం" అన్నాడు నూకరాజు. ముగ్గురూ ఊరివేపు బయల్దేరేరు. బాగా చీకటిపడిపోయింది. సముద్రం మీంచి చల్లటిగాలి వరదలై వీస్తోంది. నూకరాజు పంచపైకి లాక్కుంటూ రోడ్డు దాటి అవతలికి వెళ్లి తాడిచెట్లకి నీళ్లు పోసి వచ్చేడు. నూకరాజు చుట్టా, కాసులు సిగరెట్టూ వెలిగించేరు.

"ఏటి కాసులూ, ఈ కేంపులేటీ?" కాసులు చెప్పేడు.

"ఆ ఎధవగోలీలు తింటే రోగాలు తగ్గుతున్నయ్యా? మనం అమ్మోరిని నమ్ముకున్నాం గదా. ఇప్పుడీయన్ని ఎందుకు?

కాసులు మెదడులో, మనసులో ఏదో దీపం వెలిగి చిన్నపాటి జ్ఞానోదయం కలగడం వల్ల కడుపులోంచి మెత్తటి నవ్వు బయటపడింది. చీకటి కావడంతో నూకరాజు కాసులు నవ్వుముఖాన్ని గుర్తించలేకపోయాడు. కాసులు అన్నాడు.

"మావా ఒంటిమీద దురదలకీ, ఆడంగుల రోగాలకీ బిళ్లలిచ్చి మందులూ గట్టా రాసిచ్చి పోతారు. ఏటి ఊరికే రమన్నాననుకున్నావేటీ? ఏం పర్లేదెహె."


నూకరాజుతో చాలాసేపు మాట్లాడుతూ ఉండిపోయాడు కాసులు. నూకరాజు మాటలు వినడం లేదతను. కానీ అతను మాట్లాడుతున్నంతసేపూ కాసులికి పూర్తి జ్ఞానోదయం కలిగింది. అతనికే ఆశ్చర్యం కలిగింది. కళ్లముందు వెలుగుపడుతున్న తార్రోడ్డు కనిపించినట్లయింది. ఎదురుగుండా మనిషిని పెట్టుకుని 'యెంధవని ఊరంతా సాలుక్కుంటున్నాను" అనుకున్నాడు కాసులు. చివరికి అన్నాడతను.

"మావా బువ్వతిని బాగా పొద్దోయిం తరవాతరా. పెద్ద గొడవుంది మాటాడదారి. ఆడు లక్ష్మయ్యని కేకేద్దాం. తల్లి ప్రెమాణం మావా. నేచెప్తాను నువ్వాలకించు. ఏవవుద్దో చూద్దాగాని." ఇద్దరూ ఊరుచేరేవరకూ మళ్ళీ మాట్లాడుకోలేదు. కానీ కాసులు అడుగులు తేలికయి ఆప్యాయంగా నూకరాజు భుజం మీద చెయ్యివేసి వేగంగా నడక సాగించాడు. రాత్రి మూడుగంటల పాటు, నూకరాజింట్లో చర్చలు జరిగేయి.

నాలుగురోజుల తరువాత కాసులు భార్య, లక్ష్మయ్య భార్య, మరో ఇద్దరు ఆడవాళ్లూ యథాలాపంగా ఉన్న నాలుగైదు వీధుల్లో రెండువీధులు తిరిగి కళ్లనీళ్లు పెట్టుకున్నారు. కొత్తపాకల మహిళలు కూడా కన్నీళ్లు పెట్టుకున్నారు. ("ఏటయిందక్కా. మేంగాని సచ్చేవనుకున్నావా?") నాగమ్మ గారికి రెండ్రోజుల్నించీ ఒంటిమీద స్పృహలేదు. అన్నం ముట్టడం లేదు. పీడకలలు నిద్రపట్టు నివ్వడం లేదు. ("ఇదేటీ, మాకు తెల్దక్కా".) ఆ రోజు పొద్దున్నే లేచి ఆ జ్వరంతోనే స్నానం చేసి తడిబట్టలతో తపస్సులో కూచుందామె. ("అయిబాబోయి. నిజవే.") మధ్యాన్నం అమ్మవారు మీదికొచ్చేరు. ఊరికి అరిష్టం పట్టుకుంది. తన మాట వినకపోతే ఊరొదిలి స్వర్గానికి వెళ్లిపోతానంది తల్లిగారు. ఆ మాట వినగానే నాగమ్మగారు కుప్పకూలిపోయారు. తరవాతెప్పుడో గుక్కెడు టీ నీళ్లు తాగిందామె. "ఆయమ్మ ప్రేనాలు కాపాడుకోవాలా వద్దా వదినా?" అవునన్నారందరూ. సరిగ్గా ఇరవై మూడు నిముషాల్లో, వేసవికాలంలో అంటుకున్న ఎండుగడ్డిలా ఊరంటుకుంది. పొద్దుపోతూండగా జనం నూకరాజింటికి చేరేరు. కాసులూ, లక్ష్మయ్యావాళ్లూ బయటకుర్చీల్లో కూచుని గంభీరంగా చుట్టలు, సిగరెట్లు కాల్చుకుంటున్నారు. ఆడంగులందరూ గుమ్మం దగ్గర ఆగిపోయారు. లోపల చాపమీద కళ్లు మూసుకుని పడుకుని ఉంది నాగమ్మ. ఆమె చుట్టూ నలుగురు ఆడవాళ్లు తడికళ్లతో కూచుని ఉన్నారు. ఓ మూల అగరొత్తులు వెలుగుతున్నాయి. బయటవాళ్లని చూడగానే లోపలి ఆడంగులు దణ్నం పెడుతూ పైకి చూశారు. ఉన్నట్టుండి నాగమ్మ "అమ్మా, తల్లో దయుంచు తల్లో" అంటూ రెండు చేతులూ ఎత్తి దణ్నం పెట్టుకుంది. కుంకుమబొట్టు నుదురంతా అంటుకుపోయుంది. గుమ్మం అవతల ఆడవాళ్ల గుండెలు వేగం పుంజుకున్నాయి. ఏం మాట్లాడాలో తెలీక అలాగే ఉండిపోయారు. బయట నూకరాజుని ఒదిలి అప్పుడే అందరూ బయలుదేరేరు. నూకరాజు వేపు చూసేసరికి అతను తువాలుతో కళ్లు తడుచుకోవడం కనిపించింది. మెల్లిగా లేచి అతను అరుగు దగ్గరికి వెళ్లి అన్నాడు.

"అలాగే పడుందమ్మా. గంగమ్మ తల్లిగారు మీదికొచ్చి వెళ్లిపోయారండి. ఏటో ఊరికి మంచిదిగాదు, ఒర్షాలు పడవంటండి. రైతులు పురుగుల మందు తాగుతారంట. ఏటేటో చెప్పేరండి తల్లిగారు. పచ్చిగంగ ముట్టడంలే దీయమ్మ. రేపు పున్నివి వరకేనా ప్రేణం ఉంటదో లేదో" అని క్షణం ఆగి లోపలి కూచున్న ఆడవాళ్లతో అన్నాడతను.

"అమ్మా కాసిని దాహం ఇయ్యండి తల్లీ. తాగుద్దేమో చూద్దాం." మరుక్షణం ఆగి భారంగా కదిలివెళ్లిపోయాడు నూకరాజు. అప్పటికే ఇద్దరు ముగ్గురు ఆడవాళ్లు ముక్కులు ఎగపీలుస్తూ కళ్లు తుడుచుకుంటున్నారు. వీధి చివర లక్ష్మయ్య కొట్టు దగ్గర కాసులు, సత్తినాయుడూ వాళ్లూ తప్ప జనం పోగయ్యేరు. మరో మూడు



కార్టూన్ల పోటీలో సాధారణ ప్రచురణకు స్వీకరించిన కార్టూన్

- వినోద్, పాల్వంచ.

రోజుల్లో, ఇంటిపనులు ముగించుకుని ఆడవాళ్లందరూ నూకరాజు ఇంటి దగ్గిరే ఉంటున్నారు. ఓ సాయంత్రం జనం ఎక్కువగా ఉన్నప్పుడు హఠాత్తుగా గంగమ్మతల్లి నాగమ్మ మీదికొచ్చింది. అయిదు నిముషాల సేపు నాగమ్మ శరీరాన్ని వదల్లేదు తల్లి. మీర్నాడుదయం ఆడామగా కలిసి కలిసి ఊళ్లో గంగమ్మతల్లి గుడికెళ్లేరు. నైవేద్యాలు పెట్టి తల్లి చెప్పినట్టే నడుచుకుంటామని గ్రామం తరపున మాటిచ్చి వచ్చేరు. కొత్తపాకల శీతాకాలంలో కూడా సెగలు కక్కుతోంది. లక్ష్మయ్య నూకరాజుకి కబురుపెట్టేడు. కొట్టు దగ్గర జనం అందరూ పోగయ్యేరు. లక్ష్మయ్య అన్నాడు.

"నూకాజుగారూ, మేవంతా లేవేటండి. భయపడకండి. రేపు నాగమ్మగార్ని కాకినాడ పెద్దాసుపత్రికి తీసికెల్లం మంచిదనుకుంటున్నాను. మనిషి సగవైపోయారు మీరు. మిమ్మల్ని చూస్తుంటే బాదొచ్చెస్తోంది."

"పోయే ప్రేణం అయితే ఊరు గురించి ఈ మట్టిలో కలిసిపోద్దండి. డాక్టర్లేం జేస్తారండి. ఊరి కోసం బతికే మనిషండి మరి. ఏం జరిగినా తల్లిగారు ఊర్ని కాపాడితే చాలండి. ఆయ" అన్నాడు నూకరాజు.

"ఈ సమస్యకి అమ్మే పరిష్కారం చెప్పుద్ది లెండి" అన్నాడు అక్ష్మయ్య. ముందు రోజు విశాఖ పట్నం నుంచి ప్లీడరుగారూ వాళ్లూ వచ్చి మీటింగు పెట్టి వెళ్లేరు. మామూలుగా వెళ్లే జనం కంటే తక్కువ మంది వెళ్లేరు. జనంలో నిరుత్సాహం చూశారు ప్లీడరుగారు. పిడికిలి బిగించి ఉపన్యాసం చెప్పేరాయన. చివరిగా మూఢనమ్మకాల మీద, పూనకాల మీదా వచ్చిన వాళ్లలో ఒకమె తీవ్రంగా విరుచుకుపడింది. వాళ్లు వెళ్లిపోయింతరువాత లక్ష్మయ్య అన్నాడు.

"అదిగాదబ్బాయ్. మన గంగమ్మతల్లి మన్ని ఎప్పుడు మోసం జేసిందంట? చాలాచాలా తప్పుగ దండీ. ఈ రుజువులూ గట్టా ఆరికి తెలుస్తాయేటండి? ఏటో. పోనీండి. దేవుణ్ని నమ్మక ఇంకీపాల్నించీ దెయ్యాల్ని నమ్ముకుందాం. అసలిటా ఉంటేనే మనసుకి బాదొచ్చే దేటండి!" మర్నాడు పున్నమి అనగా నాగమ్మగారి పరిస్థితిని ఒక్కమాటలో కళ్లు తుడుచు కుంటూ చెప్పేడు నూకరాజు.

"అంతేలెండి. ప్రేణం దక్కితే రేపొక్కరోజన్నా మాట. మన అదుష్టం లేకపోతే ఈ యమ్మ ప్రేణం ఆయమ్మలో కలిసిపోద్ది." పక్కనే ఉన్న సత్తినాయుడు నూకరాజు భుజం చుట్టూ చెయ్యేసి బలవంతంగా దూరంగా తీసుకుపోయాడు. లోపలు నాగమ్మ మూలుగు నిశ్శబ్దానికి మేకులు కొడుతున్నట్టు వినిపిస్తోంది. మళ్లీ ఆ సాయంత్రం నాగమ్మగారి మీదికి అమ్మవారు ఒచ్చేరు. ఆమెను పట్టుకోవడం కష్టమైపోయింది. ఆమెను విడిచిపెట్టిందో లేదో గొల్లసీతమ్మ మీదికొచ్చింది అమ్మ. సీతమ్మ కోలుకుని మూర్ఛపోయింది.

పౌర్ణమి సాయంకాలానికి ఆకుల్లో పసుపూ, కుంకుమలు తెచ్చి నాగమ్మగారి ముందు పెట్టేరు. హారతిపళ్లేలు సిద్ధంగా ఉన్నాయి. లక్ష్మయ్య వచ్చిన జనం అందరితో మాట్లాడుతున్నాడు. కాసులు ముందు రోజే పనిమీద కాకినాడ వెళ్లిపోయాడు. ఏడు దాటుతూండగా పెద్ద కేకతో నాగమ్మమీది కొచ్చేరు అమ్మవారు. పదిహేను నిముషాలపాటు ఆమె శరీరం గాలిలో ఆకులా ఊగిపోయింది. తల్లిగారి మాట వింటామని మాట ఇచ్చిన చాలాసేపటికి గానీ నాగమ్మ మామూలు మనిషి కాలేదు. హారతులు వెలిగేయి.

మర్నాటినుంచీ నాగమ్మ మెల్లిగా కోలుకుంది. రెండ్రోజుల తరువాత బాగా పొద్దుపోయిం తరవాత కాసులు వచ్చేడు. లక్ష్మయ్య, సత్తినాయుడు, నూకరాజు పది దాటిం తరువాత కాసులు దగ్గర చేరేరు. కాసులు సంతోషంతో బాగా తేలికయిపోయాడు.

"యెండిరదం మీన లక్ష్మీదేవిని అంపిస్తా వుంటే ఊళ్లో ఎవరో రానీల్లే దంటండి. కరువొచ్చి ఊరంతా సాశానం అయిపోద్ది. అందుకే లక్ష్మిందేవిని అంపుతుంటే ఒద్దంటన్నారు. నేను గుడి ఒదిలేసి వెళ్లిపోతా నందయ్యా తల్లిగారు" అన్నాడు నూకరాజు.

"అంతా లక్ష్మయ్య పనితనం" అన్నాడు కాసులు.

"అయిడియా నీదీ గాదేటి?" అన్నాడు లక్ష్మయ్య.

"సర్లే జనాన్ని కేకేసి మీటింగెట్టించండి. మర్చేపోయాను. మేనేజరుగారు మిమ్మల్నోపాలి రమ్మన్నారయ్యా బాబూ" అన్నాడు కాసులు.


# ఆంధ్ర సారస్వత సమితి, మచిలీపట్నం

## విరోధినామ సంవత్సర ఉగాది-2009 సాహిత్య ప్రతిభా పురస్కారాలు (8వ సంవత్సరం)

| | | | |
|---|---|---|---|
| ప్రముఖ విద్యావేత్త | ఆచార్య ఎం.కె. దుర్గాప్రసాద్, వి.సి. కృష్ణా యూనివర్శిటీ, మచిలీపట్నం | బాల సాహిత్యం | ఎస్.ఎ.హెచ్. జాని |
| పద్య కవిత | మొవ్వ వృషాద్రిపతి, వారణాసి సూర్యకుమారి | జర్నలిజం | డా॥ శ్రీనాథాచారి |
| వచన కవిత | కందుకూరి శ్రీరాములు, రేణుక అయోల | వైద్య విజ్ఞానం | డా॥ ధన్వంతరీ ఆచార్య |
| నానీలు | వడలి రాధాకృష్ణ, గేయ కవిత - పి. పుష్పలీల | ఇతిహాస పరిశోధన | స్వర్ణ రాజ హనుమంతరావు |
| కథ | జొన్నవిత్తుల శ్రీరామచంద్రమూర్తి | సంగీతం | డా॥ కె. శేషులత, ఎ.కె.వి. లక్ష్మి |
| నవల | పెద్దింటి అశోక్‌కుమార్ | నృత్యం | వై. పూర్ణచంద్రరావు |
| సాహిత్య విమర్శ | డా॥ మన్నవ సత్యనారాయణ | | |
| భక్తి రచన | డా॥ కె.వి. కృష్ణకుమారి | | |
| హాస్య రచన | ఎనుగంటి వేణుగోపాల్ | | |
| నాటకరంగం | డా॥ జె. రాధాకృష్ణ, పొత్తూరి సుబ్బారావు | | |
| జాతీయ కవి | నిమ్మల అర్జునగౌడ్ | | |

పై పురస్కార గ్రహీతలకు ఒక్కొక్కరికి రూ.1,116/-లు, జ్ఞాపిక ది: 19-4-2009న మచిలీపట్నంలో జరుగు పురస్కార ప్రధానోత్సవ సభలో ఇస్తారు.

**జిసనారా**
పురస్కారాల కమిటీ సమన్వయకర్త

**కొట్టి రామారావు**
అధ్యక్షులు